క్లుప్తంగా

క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ

శంకర్‌పల్లి: యువత క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శంకర్‌పల్లి పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మహాలింగపుర శివాజీ యువజన సంఘం యువకులకు క్రికెట్ ఆయన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. క్రీడలతో యువకుల్లో స్నేహభావాలు పెంపొందుతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, రవీందర్, అనిల్, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

కొత్తూర్: మండల పరిధిలోని ఓ గ్రామంలో 12ఏళ్ల బాలికపై వరుసకు బంధువైన వ్యక్తి గురువారం అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. స్థానికుల వివరాల ప్రకారం... బాలికను గ్రామ శివారులోని పశువుల పాకాలోకి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి ప్రయత్నిస్తుండగా చుట్టూ పక్కల వారు గమనించి అతనిపైన దాడి చేసి, బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుడు అక్కడి నుంచి తప్పించుకొని పారిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బాలిక కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

జీవాలకు నట్టల నివారణ మందులు తప్పనిసరి



మందులు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: జీవాలు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చందనవెల్లి, రేగడిదోస్వాడ, బొబ్బిలిగామ గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, జీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పశువులు ఆరోగ్యంగా ఎదిగేందుకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టిందని, అర్హులందరు వినియోగించుకుని లబ్ధిపొందాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ భవనానికి స్థలం బహూకరణ



శ్రీనివాసు గుప్తను సన్మానిస్తున్న నాయకులు

కొందుర్గు: మండల కేంద్రంలో గ్రంథాలయ భవనం నిర్మాణానికి పెద్ది శ్రీనివాసుగుప్తా సోదరులు 700 గజాల స్థలాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసుగుప్త మాట్లాడుతూ.. తమ తాత, నాయనమ్మలైన పెద్ది రామచంద్రయ్య, లక్ష్మీనర్సమ్మల జ్ఞాపకార్థం ఈ స్థలాన్ని ఉచితంగా గ్రంథాలయానికి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసు గుప్తను శాలువా, పూలమాలతో సత్కరించారు. వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ మాట్లాడుతూ.. ఈ స్థలం విలువ రూ. 30 లక్షల పైనే ఉంటుందని శ్రీనివాసు గుప్తకుటుంబ సభ్యులు గ్రంథాలయానికి ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మురళీయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణరెడ్డి, నాయకులు కృష్ణయ్య.యాదయ్య, బాబురావు, యాదగిరి, జగదీశ్వర్‌గౌడ్, రామకృష్ణ పాల్గొన్నారు.

వర్మికంపోస్ట్ తయారీలో మెలకువలు తప్పనిసరి

డీన్ డా.సి.నరేంద్రరెడ్డి

షాబాద్: వర్మికంపోస్ట్ తయారీలో రైతులు మెలకువలు పాటించాలని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.సి.నరేంద్రరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తాళ్లపల్లి, ముద్దెంగూడ గ్రామాల రైతులకు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో వర్మికంపోస్ట్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సేంద్రియ ఎరువుల్లో వర్మికంపోస్ట్ ముఖ్యమైందన్నారు. వానపాములు ఎర్రనేలలు ఎక్కువగా ఉన్న పొల్లాల్లో తయారు చేసుకోవాలన్నారు. వర్మికంపోస్ట్ తయారీ విధానంలో మెలకువలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఐసీఎఆర్ షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక 2022–23 కింద మంజూరైన నిధులతో వర్మికంపోస్ట్ ఎరువుల తయారీపై రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారి డా.పి సతీష్ మాట్లాడుతూ.. అధిక దిగుబడులను పొందడానికి రైతులు విచక్షణ రహితంగా రసాయనిక ఎరువులు వాడడం వల్ల పంటలు పండే భూములు నిర్జీవంగా మారుతున్నాయని చెప్పారు. వర్మికంపోస్ట్ తయారీ చేసుకోవడం చాలా సులభమని తెలిపారు. కేవలం చిన్నచిన్న మెలకువలు పాటిస్తే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈశ్వరి, మాధవి, ఏటి వెంకటేశం, ఏఈఓ రాజేశ్వరి, మహిళ రైతులు తదితరులున్నారు.

‘అనుబంధం’ అవస్థలమయం

అనుబంధ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతూ కాలం వెళ్లదీస్తున్నారు.. చదువు కోసం విద్యార్థులు, పింఛన్ కోసం వృద్ధులు, పౌష్టికాహారం కోసం మహిళలు కనీసం ఐదారు కిలో మీటర్లు నడవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులుకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రోడ్లు, పాఠశాల భవనాలు లేక తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వాపోతున్నారు.

- కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు
- ఏం కావాలన్నా గ్రామ పంచాయతీకి వెళ్లాల్సిందే..
- గర్భిణులు, వృద్ధులు, విద్యార్థుల పరిస్థితి వర్ణనాతీతం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



చుక్కమెట్టు గ్రామ ముఖచిత్రం

కొందుర్గు: గ్రామపంచాయతీల అనుబంధ గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడం పాలకుల, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఆయా గ్రామాలకు సంబంధించి అభివృద్ధి పనుల నిర్వహణకు నిధులు మంజూరైనప్పటికీ స్థానిక నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో నిధులు ఖర్చుఅవుతున్నా పనులు పూర్తికాక సమస్యలు తీరడం లేదు. కొందుర్గు మండలంలో 22 గ్రామపంచాయతీలతో పాటు 8 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. అలాగే, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 24 గ్రామపంచాయతీలతో పాటు 18 అనుబంధ గ్రామాలు, గిరిజన తండాలు ఉన్నాయి. అయితే గ్రామపంచాయతీ కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉండడంతో గ్రామపంచాయతీల్లో కొంతవరకు అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ అనుబంధ గ్రామాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

కొన్ని అనుబంధ గ్రామాల దుస్థితి..

కొందుర్గు మండలం చుక్కమెట్టు రెవెన్యూ గ్రామం. ఇక్కడ 20 కుటుంబాలు, 100 వరకు జనాభా ఉంటున్నారు. ఈ గ్రామంలో పూర్వం అన్ని వర్గాల వారు నివసించేవారు. ఇక్కడ సరైన వసతులు లేకపోవడం వల్ల చాలా కుటుంబాలు సమీప గ్రామమైన ముట్పూర్‌కి వలస వెళ్లారు. దళిత కుటుంబాలు మాత్రమే ఊరు విడిచి వెళ్లే స్తోమత లేక ఇక్కడే ఉంటున్నారు. 20 ఏళ్ల క్రితమే ఇక్కడ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించింది. అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా మంజూరు చేసింది. కానీ, ప్రస్తుతం పాఠశాల భవనం మూతపడింది. అంగన్‌వాడీ కేంద్రాన్ని ముట్పూర్ గ్రామానికి తరలించారు. దీంతో చిన్నారులు చదువుకోవాలంటే ముట్పూర్‌కు వెళ్లాలిందే. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కృషితో గ్రామానికి బీటీరోడ్డు వేయడం జరిగింది. అదీ కూడా అసంపూర్తిగానే ఉంది. ఇక తంగెళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో దళితవాడకు ప్రభుత్వం పాఠశాలను మంజూరు చేసింది. పాఠశాల భవనం కోసం రెండు గదులకు నిధులు మంజూరైనా నేటికి అసంపూర్తిగానే ఉన్నాయి. అయోధ్యాపూర్‌తండా పరిధిలో రామన్నగడ్డ తండా పాఠశాల ఉన్నా విద్యార్థులు లేరని ఆ పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై పుల్లప్పగూడ పాఠశాలలో పనిచేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో..

మండలంలోని పద్మారం గ్రామపంచాయతీ రంజాతండాలో 20 కుటుంబాలు, దాదాపు 100 మంది జనాభా ఉన్నారు. ఇక్కడ ప్రభుత్వం పాఠశాల భవనం కోసం నిధులు మంజూరుచేసినప్పటికీ అసంపూర్తిగానే ఉంది. దీంతో పాఠశాలను సమీపంలో ఉన్న వికారాబాద్ జిల్లా పరిగి మండలం చాకలిపల్లితండాలో నడిపిస్తారు.

రేషన్, పింఛన్ అన్ని గ్రామపంచాయతీ కేంద్రాల్లోనే...

అయితే, అనుబంధ గ్రామాల్లో రేషన్‌షాపులు లేకపోవడం వల్ల ప్రతినెల రేషన్ సరుకుల కోసం కాలినడకన గ్రామపంచాయతీ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. చివరకు ఆసరా పింఛన్ కోసం వృద్ధులు వికలాంగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక శివారు గ్రామాలకు రోడ్డు సౌకర్యం సరిగ్గాలేక పోవడం వల్ల వర్షాకాలంలో అనేక అవస్థలు పడుతున్నారు.

ముట్పూర్‌కు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి..



ప్రతినెల రేషన్ సరుకులను ముట్పూర్‌కు వెళ్లి తెచ్చుకోవాలి. అలాగే, చదువుకోవాలంటే పిల్లలు ప్రతిరోజు 5 కిలోమీటర్లు నడిచివెళ్లాలి. చివరకు పౌష్టికాహారం తెచ్చుకోవాలంటే గర్భిణులు, బాలింతలు ముట్పూర్‌కు వెళ్లాల్సిందే.

– ఆగిర్యాల లక్ష్మి

రోడ్డు వేయిస్తే బాగుండేది..



రంజాతండాకు రోడ్డు వేయిస్తే బాగుండేది. వర్షాకాలంలో నడిచివెళ్లాలంటే కూడా వీలుకాదు. బురదలో దిగబడుతూ నడవాలి. ఓట్లు వేయించుకునేటప్పుడు తండాకు అన్ని చేస్తాం. అంటారు. ఓట్లు అయిపోయినంకా ఎవరు మళ్లీచూడరు.

– లక్ష్మమ్మ, రంజాతండా

ఘనంగా అమ్మవారి విగ్రహాల ఊరేగింపు

మొయినాబాద్: మండలంలోని సురంగల్ గ్రామంలో గత మూడు రోజులుగా కట్ట మైసమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠపాన పూజలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం గ్రామంలో అమ్మవారి విగ్రహాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మూడవ రోజున ఆలయం వద్ద వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారి ఆలయ ప్రాంగణంలో హోమగుండాలు ఏర్పాటు చేసి హోమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలకు క్షీరాభిషేకాలు, జలభిషేకాలు చేశారు. ఆదాయపు పన్ను శాఖ మాజీ అధికారి రాములు, సర్పంచ్ గడ్డం లావణ్యఅంజిరెడ్డి, మాజీ సర్పంచ్ అవుసుల లావణ్యభాస్కర్‌చారి, మేకల రాంచంద్రయ్య అమృతమ్మల దంపతులు కూర్చొని పూజలు చేశారు. గ్రామంలో సాయంత్రం అమ్మవారి విగ్రహాలను దివ్య రథం మీద వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో ఉప సర్పంచ్ జె.యాదమ్మ, మాజీ సర్పంచ్ భద్రప్ప, ఆలయ కమిటీ పెద్దలు జి. నర్సింహ్మారెడ్డి, కందికొండ మల్లేశ్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ జైపాల్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జీతారాంరెడ్డి, ఎట్టయ్య, గౌతం రెడ్డి, రాజు, అశోక్‌గౌడ్, నారాయణరెడ్డి, మహేశ్‌గౌడ్, గోపాల్‌యాదవ్, రాజేశ్, వినాయక్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఎమ్మెల్సీగా మాణిక్‌రెడ్డిని గెలిపించండి

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య

చేవెళ్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తారని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎరువుల గాలయ్య అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని కందవాడ, గుండాల, చనువెళ్లి, ఖానాపూర్, ఆలూరు, అంతారం, కౌకుంట్ల, తంగడపల్లి, కొత్తపల్లి తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో 33 సంవత్సరాల పాటు జిల్లాలో ఉద్యమ నాయకుడిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. అలాంటి వారు ఎమ్మెల్సీగా ఎన్నికైతే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తారని చెప్పారు. ఉపాధ్యాయులంతా ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. జీఓ 317 కారణంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను దశలవారీగా సొంత జిల్లాలకు బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రచారంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్‌నాయక్, వెంకటన్న, మహమ్మద్ అక్బర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు గణేశ్, లాలయ్య, నాగేంద్రం, ప్రవీణ్, విజయ్, కుమార్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకుడు గాలయ్య, తదితరులు

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం హామీ ఏమైంది?

బీజేపీ నేత శ్రీవర్ధన్ రెడ్డి

కొందుర్గు: గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం హామీ ఏమైందని బీజేపీ నేత శ్రీవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా గురువారం బీజేపీ నాయకులు చౌదరిగూడలో ఏర్పాటు చేసిన సమావేశానికి శ్రీవర్ధన్ రెడ్డి హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టి తొమ్మిదేళ్లు గడిచినా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఊసెత్తకపోవడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ నాయకులకు అబద్ధపు ప్రచారం చేసుకోవడం అలవాటుగా మారిందని విమర్శించారు. దళితుల పేరు చెప్పుకొని ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్ ఇళ్లు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కుర్మయ్య, నాయకులు రాజు, సురేష్, నర్సింలు, చంద్రమౌళి, ప్రభు, అంజయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్ రెడ్డి

రథశాలను కూల్చితే సహించం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం రథశాలను కూల్చితే సహించేదిలేదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రథశాల కూల్చివేతకు నిరసనగా గురువారం విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మతంరాచప్ప ఆధ్వర్యంలో రథశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు బండారి రమేష్, శ్రీవర్ధన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. జానంపేట వేంకటేశ్వర స్వామి దేవాలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. స్వాతంత్ర్యానికి ముందే ఆలయం, రథశాలను నిర్మించారని చెప్పారు. పురాతన కట్టడాలను కూల్చడం సరికాదని హితవు పలికారు. వేంకటేశ్వరస్వామి దేవాలయం రథశాలను కూల్చవద్దని గతంలోనే అఖిల పక్ష సమావేశంలో స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. హిందువుల మనోభావాలకు అనుగుణంగా రథశాల కూల్చివేత ప్రక్రియను విరమించుకోవాలన్నారు. రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు మేము వ్యతిరేకం కాదని తలిపారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్, చెట్లవెంకటేష్, ఆకులప్రదీప్, రమణ, ప్రభు, శ్రీనివాస్‌చారి, ఎం కన్నోళ్లవెంకటేష్, మోహన్‌సింగ్, రమేష్, వంశీ, హన్మంత్‌రెడ్డి, నాగేశ్వర్, రంగయ్య పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



ఎంపీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కొందుర్గు: గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కొందుర్గు ఎంపీఓకు పంచాయతీ కార్మికులు వినతి పత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, 4 లేబర్ కోడ్‌ను అమలులోకి తెచ్చిందని విమర్శించారు. గ్రామపంచాయతీ సిబ్బందికి కార్మిక చట్టాలు వర్తించకుండా కుట్ర చేసిందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ 51 విడుదల చేసి 500 జనాభాకు ఒక కార్మికుడిని నియమించి రూ. 8500 వేతనం నిర్ణయించిదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి గోపాల్, నాయకులు భాగ్యమ్మ, సత్యమ్మ, పవన్, సత్యయ్య, నర్సమ్మ, మంజుల పాల్గొన్నారు.

ఘనంగా వారణాసి రామయ్య వార్షికోత్సవం



గీతాపారాయణం నిర్వహిస్తున్న భజన మండలి సభ్యులు, గ్రామస్తులు

మొయినాబాద్ రూరల్: కనకమామిడి గ్రామంలో వెలిసిన దత్తాత్రేయస్వామి దేవాలయంలో సద్గురు వారణాసి రామయ్య ప్రభువుల 81వ వార్షికోత్సవ ఉత్సవాలను గురువారం వేదపండితులు, ఆలయ పూజారులు, ప్రభువు శిషుమండలి గ్రామపెద్దలు, నిర్వాహకులు గణపతి హోమంతో ప్రారంభించారు. గణపతి హోమం, దీపారాధన, అభిషేకాలు, గీతపారాయణం నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాలు, గ్రామాల నుంచి భజన మండలి సభ్యులు విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి భక్తిగీతాలు ఆలపించారు. దీంతో, కనకమామిడి గ్రామంలో వారణాసి రామయ్య నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో కనకమామిడి వేంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ కొండ లక్ష్మీకాంత్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ పట్లోళ్ల జనార్దన్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రభావతిగణేష్‌రెడ్డి, వారణాసి కమిటీ శిశులు జగన్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తేనే కష్టాలు తీరుతాయి..

జోడో పాదయాత్రలో శంకర్

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుపేదల కష్టాలు తీరుతాయని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో హాత్‌సే హాత్ జోడో పాదయాత్రను చేపట్టారు. కళాకారుల ఆటపాటలతో, మహిళా కార్య కర్తల సమీకరణతో పాదయాత్రను ఎద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ హాజరై ఆయా వార్డుల్లో పాదయాత్రను చేపట్టిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోకుండా గాలికి వదిలేశాయని అన్నారు. మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొన్న నాయకులు బస్తీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బడుగు బలహీన వర్గాల జీవితాలు బాగుపడతాయని, ఇంటి స్థలం ఉన్నవారు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలను ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, మైనార్టీ సెల్, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న శంకర్, తదితరులు

యువతకు ఆదర్శంగా భగత్‌సింగ్ జీవితం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్‌రూరల్: దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ జీవిత చరిత్రను యువత ఆదర్శంగా తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. రాష్ట్ర సీఐటీయూ, ప్రజా సంఘాల పిలుపు మేరకు ఈ నెల 21నుంచి 23 వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో రెడ్ బుక్‌డే దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం భగత్‌సింగ్ రెడ్‌బుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజు హాజరై మాట్లాడుతూ...అతిపిన్న వయసులోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని తన ప్రాణాన్ని లెక్క చేయకుండా దేశంకోసం పోరాడిన వ్యక్తి షహీద్ భగత్‌సింగ్ అని కొనియాడారు. యువత ఆయన జీవిత చరిత్రను స్ఫూర్తిగా ముందుకు సాగాలని అన్నారు. శాస్త్రీయ ఆలోచనలు, హేతువాద ఆచరణకు విరుద్ధంగా మూఢ విశ్వాసాలను, ఆచారాలను నేటి పాలకులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనునా యక్, సాయిబాబు, ఈశ్వర్‌నాయక్, చంద్రమౌళి, నర్సింలు, లక్ష్మి, చైతన్య, లలిత, రాజశేఖర్, శ్రీకాంత్, సాయి, రాములు, పాండు, హీరునాయక్ పాల్గొన్నారు.



రెడ్‌బుక్‌ను ఆవిష్కరిస్తున్న చేస్తున్న రాజు

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

సీఐటీయూ నాయకుడు దేవేందర్

మొయినాబాద్‌రూరల్: గత కొన్ని నెలలుగా పంచాయతీ కార్మికులకు జీతాలులేక అల్లాడుతున్నారని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 40 వేల మంది పంచాయతీ కార్మికులు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారన్నారు. జీఓ నంబర్ 51 ప్రకారం 500 మంది జనాభాకు ఒక గ్రామ పంచాయతీ కార్మికుడిని పరిగణిస్తున్నారని 2011 జనాభా లెక్కల ప్రకారం 8500 వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు.ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కో రారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నం, సీఐటీయూ మండల కన్వీనర్ ప్రవీణ్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ప్రభుదాస్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామ శివారులోని మహాలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలను గ్రామస్తులు నిర్వహించారు. పోటీలకు తెలుగు ఉభయ రాష్ట్రాల పరిధిలోని రైతులు ఎద్దులతో హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు రెండు రాష్ట్రాల నుంచి 11 జతల ఎద్దులు వచ్చాయి. ఈ పోటీల్లో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని పొద్దుటూరుకు చెందిన బికేరావు ఎద్దులు విజయం సాధించాయి. మొదటి బహుమతిగా 1,10,116లను నిర్వాహకులు అందజేశారు. ద్వితీయ స్థానంలో నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని మూడురాళ్లపల్లె నుంచి వచ్చిన ఓబుల్‌రెడ్డి ఎద్దులకు రూ.90వేలు, తృతీయ స్థానంలో నంద్యాల జిల్లా డోన్ మండలంలోని కొత్తకోట నుంచి డాక్టర్ గురునాథ్ ఎద్దులకు రూ.80వేలు, నాలుగోవ స్థానంలో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండల కేంద్రం నుంచి వచ్చిన అంజిరెడ్డి ఎద్దులకు రూ. 70వేలు, ఐదవ స్థానంలో వైఎస్సార్ జిల్లా వీరపనాయుడిపల్లె మండలంలోని కీర్తిపల్లె నుంచి వచ్చిన చిట్టిబోయిన భరత్‌కుమార్ ఎద్దులకు రూ. 60వేలు, ఆరవ స్థానంలో అనంతపూర్ జిల్లా గార్లదిన్నె మండల కేంద్రం నుంచి వచ్చిన రామాంజనేయులు ఎద్దులకు రూ.50వేలు, ఏడవ స్థానంలో బహుమతిని అనంతపూర్ జిల్లా గార్లదిన్నె మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన నాగేశ్వర్‌రెడ్డి ఎద్దులకు రూ. 40వేల అందజేశారు. ఎనిమిదవ స్థానంలో వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని పెద్ద గడద నుంచి గోపాల్‌రెడ్డి ఎద్దులు రూ.30వేలు గెలుపొందాయి. అలాగే, జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలంలోని కంచుపాడు నుంచి వచ్చిన సుధాకర్‌రెడ్డి ఎద్దులు, జోగులాండ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని పెద్దాది నుంచి లక్ష్మీనారాయణ ఎద్దులు, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోని పిఆర్ పల్లె నుంచి చిన్ననాగయ్య ఎద్దుల వారికి రూ.20వేల చొప్పున్న ప్రోత్సాహకం అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మమ్మ, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గండ్ర జగదీశ్వర్‌గౌడ్, దేవాలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

గ్రంథాలయ సేవలను గ్రామాలకు విస్తరిస్తాం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి

షాద్‌నగర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాలకు గ్రంథాలయ సేవలను విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన గ్రేడ్–1 గ్రంథాలయ భవనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన భవనంలో పాఠకులకు కావాల్సిన వసతులపై గ్రంథ పాలకులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పౌర పఠన కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించడంతో పల్లె ప్రాంతాలకు గ్రంథాలయ సేవలను విస్తరించే అవకాశం లభించిందన్నారు. ప్రతి మండలంలో కనీసం రెండు మేజర్ గ్రామపంచాయతీల్లో గ్రామీణ గ్రంథాలయాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచన మేరకు నియోజకవర్గంలో మొదటి విడతగా ఆరు గ్రామీణ గ్రంథాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొందుర్గు మండల కేంద్రంలో నూతనంగా గ్రంథాలయ భవన నిర్మాణానికి 700 గజాల స్థలాన్ని ఇచ్చిన దాత శ్రీనివాస్‌గుప్తను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్, షాద్‌నగర్ గ్రంథాలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహ్మారెడ్డి, గ్రంథ పాలకులు ప్రతాప్, సభ్యుడు సుధాకర్, శ్వేత, శంకర్, శంకరయ్య పాల్గొన్నారు.



భవనాన్ని పరిశీలిస్తున్న వెంకటరమణారెడ్డి